కథ

# నిజమిదనీ...



## 'నేను హంతకుణ్ణో!?

**చీమకైనా పొరపాట్నకూడా హాని తలపెట్టని వాణ్ణి- కసాయివా-డిలా మారిపోయా నెందుకూ?**

**అదీ అద్దాల్లోని బిడ్డను తుదముట్టించా లనుకోవడం...**

**లేక లేక పుట్టిన ఆ పిల్లాణ్ణి చంపడం మహా పాతకమని తనకి తెల్సి కూడా ఎందుకీ నిర్ణయం తీసుకున్నట్లు...?"**

పొట్టిముత్యాల వనజ

మనసుకీ, గుండెకీ జరుగుతోన్న ఘర్షణ టెన్షన్... అతడి బుర్రవేడెక్కేలా చేస్తున్నాయి... సావకాశంగా ఆలోచించేందుక్కూడా అవకాశం- లేకుండా.

ఆఖరికి మనసే జయించింది! గుండె బండబారి పోయింది... అరగంట నుండీ జరిగిన అంతర్మథనం ఫలితంగా.

ఆ ప్రక్కనే ఉన్న షాపు కెళ్ళాడు. బియ్యం కావాలన్నట్లుగా లోనికి దారి తీశాడు. అందులోంచి ఓ రెండు వడ్ల గింజల్ని ఏరుకుని 'ముతకరకం' అంటూ పెదవి విరుస్తూ ఇవతలి కొచ్చేశాడు.

ఒక్కో అడుగే- బోదకాళ్ళలా-భారంగా వేసుకుంటూ- హాస్పిటల్లోని- స్పెషల్ వార్డు దగ్గర నించున్నాడు... యమ కింకరుడిలా.

నర్స్ తనకేసే వస్తోంటే... ప్రక్కకు నక్కుదామని... అనుకునే లోపలే... ఆమె కంట పడనే పడ్డాడు.

"మీ భార్య మిమ్మల్ని పిలుస్తోందని చెప్పి ఎంతసేపయ్యింది. వెళ్ళలేదేం? పాపం, ముందెళ్ళి ఆమెను ఓదార్చండీ.' అంటోంది జాలిగా.

తలదించుకున్నాడు... అతడి కళ్ళలోని ఎర్రజీరలు ఆమె దృష్టిలో పడకుండా.

ఎంత చెప్తున్నా కదలక, శిలా విగ్రహంలా నించున్న అతడి ఆంతర్యం అవగాహన చేసుకోలేక ఆ సిస్టర్ - వెళ్ళిపోయింది... మరో రూంలోకి.

భార్య జనరల్ వార్డులో...

భార్య చెల్లి... అంటే తన మరదలు స్పెషల్ ఏ.సి. రూమ్‌లో.

అతడు ఇంజనీర్!

తనేమో ఓ మామూలు ఎల్డీసీ. పైగా



ముగ్గురు ఆడపిల్లల తండ్రి.

ఈసారి పిల్లాడు పుడ్తాడనే గట్టినమ్మకంతో భార్య నెల తప్పినప్పట్నుండీ... క్రమం తప్పక గుళ్ళూ గోపురాలూ తిరిగాడు.

తన మరదలు - మూడ్రోజుల క్రితమే... డెలివరీకని ఈ హాస్పిటల్లోనే అడ్మిట్ అయ్యింది.

అయితే ఎంతకీ పురిటి నొప్పులు రావ డం లేదని- ఆందోళన పడ్డారు డాక్టర్లు... ఆమెకి అదే ఆఖరి కాన్పు గనక.

అప్పటికే నాలుగు అబార్షన్లు అయి పో యాయి. ఇకపై ఆమెకి ప్రెగ్నెన్సీ రావడం కూడా ప్రమాదమని డాక్టర్లు తేల్చి పారేశారు.

అదే ఊళ్ళో ఉన్నా, తమకూ, వాళ్ళకీ పెద్దగా అటాచ్‌మెంట్ అంటూ ఏమీ లేదు. వాళ్ళ హోహతుకు సరితూగనందువల్ల.

తనది 'సైకిల్' బ్రతుకు!

పెద్ద బంగళాలో ఉంటూ... ఖరీదైన కార్లలో తిరుగుతోన్న వాళ్ళస్థాయికి తను ఎన్ని జన్మలెత్తినా అందుకోలేడని తెలుసు.

ఈరోజు అశనిపాతంలా- తన భార్యకు ఏడో నెలలోనే నొప్పులు రావడం... తప్పనిసరై తానూ అదే హాస్పిటల్లో చేర్పించడం... పుట్టింది పిల్లాడే అయినా, నెలలు నిండకుండానే పుట్టినందువల్ల, బలహీనంగా ఉన్న ఆ బిడ్డ నిమిషాల్లోనే కన్నుమూ యడం... వెన్వెంటనే జరిగిపోయాయి.

మొగుడు కొట్టినందుక్కాదు... తోడి కోడలు నవ్వినందుకన్నట్లు...

దుర్యోధనుడు మయసభలో కాలు జారినందుక్కాదు... ద్రౌపది పరిహసించినందుకే అన్నట్లు...

తన...'కో-బ్రదర్' హాస్పిటలంతా స్వీట్స్‌పం చుతూ... కొడుకు పుట్టాడని పండుగ చేసుకుంటూ ఉంటే... ఉక్రోషంతో ఊగిపోయాడు శివమెత్తినట్లు.

ఆడపిల్ల పుట్టి... పురిట్లోనే చనిపోయినా, హాయిగా ఊపిరి పీల్చుకునే వాడేమో.

కానీ పుట్టి చనిపోయింది... పిల్లాడు- అంగ... పిల్లాడు.

అదే అంతులేని తన ఆవేదన.

అదే ఉపశమించని తన ఆత్మఘోష!

తన భార్య ఉన్న జనరల్ వార్డు దాటుకుని వెళ్తున్నా- అక్కడ పడుకుని ఉన్న ఆమెకేసి చూడాలన్పించ లేదు!

మరణ మృదంగంలా గుండె రెట్టింపు వేగంతో చప్పుడు చేస్తోంటే- స్పెషల్ రూమ్‌లోకి... అడుగు పెట్టాడు. ఉయ్యాల్లో బిడ్డ- హాయిగా నిదరోతున్నాడు.

అటుతిరిగి పడుకుని ఉంది మరదలు.

అతను మాత్రం ఇంకా స్వీట్స్ పంచు తున్న సంబరంలోనే మునిగి ఉన్నట్లున్నాడు.

అలికిడవడంతో... వెనక్కి తిరిగి చూస్తూ...

"రండి బావగారూ! బాబును చూసేందు కొచ్చారా!" అంటోంది నీరసంగా.

బదులు పలకలేదు - తను.

ఆమెకి అడ్డుగా నించుని బాబు బుగ్గలు నిమురుతున్నట్లుగా... చటుక్కున ఆ రెండు వడ్లగింజల్ని నోట్లో వేసి - అర్జంటు పనుందన్నట్టుగా హడావిడిగా వెళ్ళి - భార్య దగ్గర స్టూల్ లాక్కుని కూర్చున్నాడు.

"ఇప్పటికొచ్చారా! మీ కోసం ఎన్నిసార్లు కబురు పెట్టానో తెలుసా!

చాలీచాలని జీతంతో... ఈ ముగ్గురు బిడ్డల్నీ పోషించలేక, నానా యాతన పడ్తున్నాం!

ఇంకా నాలుగోబిడ్డకు పోషణ, చదువు సంధ్యలు మనకు సాధ్యంకాని పని...!"

"ఈ ఉపోద్ఘాతమంతా ఎందుకూ! పిల్లా డు చచ్చాడు. నువ్వెలాగూ పోషించలేని అసమర్థుడివి గనక- ఇక బాధ పడక్కర్లేదు. అని దెప్పిపొడుపా!" సూటిగా చూశాడు ఆమె కేసి.

"కోప్పడకండీ. నేను బాగా ఆలోచించే డాక్టర్‌తో మాట్లాడే, ఈనిర్ణయాని కొచ్చాను.

మా చెల్లికి పుట్టిచనిపోయిన బిడ్డను నా పక్కలో పడుకో బెట్టించుకుని - మన బిడ్డను మా చెల్లి దగ్గర పడుకోబెట్టాను. వాడు అక్కడుంటేనే రాజాలా బ్రతుకుతాడు. దానికి ఇంకెలాగూ కడుపు పండే యోగం లేదు కాబట్టి... మీతో ఈ విషయం మాట్లాడేందుకు టైం..."

సుడిగాలిలా వెళ్ళిపోతోన్న భర్త వైఖరికి మ్రాన్పడి పోయిందామె.

పరుగున వెళ్ళాడు. పిల్లాడి మెడక్రింద చెయ్యివేసి, తలను పైకి లేవనెత్తి... చూపుడు వ్రేలితో... నోట్లో నాలుగు మూలలా తడిమి చూశాడు.

చెట్టంత మనిషి స్వేదంతో నిలువెల్లా కంపించి పోతూండటంతో ప్రశ్నార్థకంగా చూడసాగారు. ఆ భార్యాభర్తలిద్దరూ.

"ఎంతలో ఎంతఘోరం జరిగిపోయింది. ఇదంతా మా దాయాదులే చేసి ఉంటారు ఆస్తికోసం. సమయానికి మీరు దేవుడిలా రాకపోయుంటే..."

చెమ్మగిల్లిన కళ్ళతో ఆ వడ్లగింజలకేసి చూస్తూ కృతజ్ఞతా పూర్వకంగా అతని చేతులు పట్టుకు ని చెప్తోన్న వాళ్ళ మాటలు వినే స్థితిలో లేదు.

"థాంక్ గాడ్!"

రిలీఫ్‌గా ఫీలవుతూ బాబును ఎత్తుకుని తనివితీరా గుండెలకి హత్తుకుని వారి కందించి వెనుదిరిగాడు...

అది త్యాగమంటారో, స్వార్థమంటారో అర్థంగాని సందిగ్ధంలో... ★

